# భారత సర్వోన్నత న్యాయస్థానం

తీర్పు తేదీ: 05/02/1951

(గౌరవ న్యాయమూర్తులు: సయ్యద్ ఫజల్ అలీ, మెహర్ చంద్ మహాజన్, ముఖర్జీయ మరియు, చంద్రశేఖర అయ్యర్)

**బద్రీ నారాయణ్ ఝా మరియు ఇతరులు**

**Vs.**

**రామేశ్వర్ దయాల్ సింగ్ మరియు ఇతరులు**

**భూయజమాని మరియు కౌలుదారు – విలీనం – మొకర్రారి హక్కు కలిగి ఉన్న చాలా మంది ఉమ్మడి హక్కుదారులలో ఒకరు విభజన సమయంలో లఖ్ రాయి హక్కు భాగాన్ని పొందుట– విలీనం లేకుండుట – కౌలుదారుల మధ్య జరిగిన విభజన – కౌలుదాతకు సంబంధించినంత వరకు, కౌలు యొక్క సమగ్రత ప్రభావితం కాకుండుట.**

ఒక కౌలుదాత కౌలుదారుని యొక్క పూర్తి హక్కును కొనుగోలు చేసినట్లైతే, ఆ కౌలు విలీనము వలన లుప్తమైపోతుంది, కానీ మొకర్రారి హక్కు కలిగి ఉన్న చాలా మంది ఉమ్మడి హక్కుదారులలో ఒకరు లఖ్ రాయి హక్కు భాగాన్ని కొనుగోలు చేసినట్లైతే, విలీనము కానీ, (కౌలు) లుప్తమవుట కానీ, జరగదు. చాలా మంది మొకర్రారిదార్ల మధ్య జరిగిన విభజన, కౌలు యొక్క అఖండతను ఏ విధముగానైనా ప్రభావితం చేయడం కానీ, లేక అందులో హక్కు కలిగిన ప్రతి వ్యక్తినీ, ప్రత్యేకమైన వేరు కౌలుదారునిగా చేయడం కానీ, జరగదు మరియు ఆ విభజనతో సంబంధం లేకుండా మొకర్రారిదార్లందరూ కలిసి కౌలుదాత యెడల బాధ్యత వ హించవలసి ఉంటుంది లేదా (అందరూ కలిసి) ఒక కౌలుదారుని వలె మొత్తం కౌలును చెల్లించవలసి ఉంటుంది.

*వైట్ v. టిండాల్ (13 ఏపివపికేసు. 263)* వర్తించడమైనది.

**సివిల్ అప్పీలేట్ న్యాయనిర్ణయ అధికార పరిధి: హక్కు (టైటిల్) దావా నెం. 9/1939 లో ఉత్పన్నమైన ఆద్య(ఒరిజినల్) డిక్రీ నెం. 117/1942 నుండి వచ్చిన అప్పీలులో, తేదీ 14.02.1946 న పాట్నాలోని హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ ఇచ్చిన తీర్పు మరియు డిక్రీ నుండి వచ్చిన అప్పీలు: సివిల్ అప్పీలు నెం. 40/1950.**

**అప్పీలుదారు తరపున ఎస్.సి. మిశ్రా.**

**ప్రతివాది తరపున ఎన్‌సిఛటర్జీ (వారితో పాటు పిబి గంగోలి).**

**5, ఫిబ్రవరి 1951 న గౌరవ న్యాయమూర్తి మహాజన్ గారిచే వెలువరించబడిన కోర్టు యొక్క తీర్పు:-**
పాలమౌలోని సబార్డినేట్ జడ్జి గారి కోర్టు ముందు , కొన్ని భూములపై హక్కు గురించి చాలా ప్రకటనల (declarations) కొరకూ మరియు ప్రతివాదులు వేసిన కౌలు గురించిన దావాను కొనసాగించకుండా నిరోధము కొరకూ , అప్పీలుదారులు ప్రతివాదులపై దాఖలు చేసిన దావా నెం.9/1939 నుండి ఈ అప్పీలు ఉత్పన్నమైనది. ఈ దావా సబార్డినేట్ జడ్జి గారిచే డిక్రీ చేయబడింది కానీ , ఆ నిర్ణయము అప్పీల్‌లో పాట్నాలోని హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ చే ప్రతివర్తనం చేయబడి, దావా త్రోసిపుచ్చబడినది.

ఈ కేసు లోని ముఖ్యమైన వాస్తవాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: దర్హా గ్రామము, పాథక్ ల కుటుంబమునకు సంబంధించి పూర్వీకపు లఖ్రాజ్ అయి ఉన్నది. సుమారు వంద సంవత్సరాల క్రితం పాథక్ లు మొకర్రారిలో ఉన్న మొత్తము గ్రామాన్ని సింఘాల (ప్రతివాదుల యొక్క మొదటి మరియు రెండవ పక్షాలు) కుటుంబానికి చెందిన పూర్వీకులకు రూ. 24/- ల సంవత్సరపు జామా నకు ఇవ్వడము

జరిగినది. కాలక్రమేణా ఈ మొకర్రారి హక్కు సింఘాల కుటుంబంలోని మూడు శాఖల కు, ఈ క్రింద చెప్పబడిన దామాషా లలో సంక్రమించినది:

ప్రతివాదులలో మొదటి పక్షమైన పరమేశ్వర దయాళ్ మరియు ఇతరులకు ఆరు అణాల వరకు ; ప్రతివాదులలో రెండవ పక్షమైన బిశ్వేశ్వర దయాళ్ సింగ్ నకు ఎనిమిది అణాల వరకు; మరియు మధో శరణ్ సింగ్ నకు రెండు అణాల వరకు. తరువాత వాదుల( plaintiffs) యొక్క తండ్రి అయిన హిరానంద్ ఝా , దుర్గానంద్ ఝా మరియు ధరమ్ దయాల్ తో కలిసి , ఉమ్మడిగా మధోశరణ్ సింగ్ యొక్క రెండు అణాల భాగాన్ని కొనుగోలు చేసినారు. ధరమ్ దయాల్ కేవలము హిరానంద్ ఝా యొక్క బినామీదారు.

తేదీ 5 జూన్, 1916న, బిషేశ్వర్ దయాళ్ సింగ్ , డియోలాల్ పాథక్ మరియు ఇతరుల నుండి లఖ్రాజ్ హక్కులో ఆరు అణాల భాగాన్ని కొనుగోలు చేయడమూ, మరియు తేదీ 9 ఫిబ్రవరి, 1917న, అతడు మందిల్ పాథక్ నుండి మ రొక రెండు అణా ల భాగాన్ని కొనుగోలు చేయడమూ జరిగినది. ఈ కొనుగోళ్ల వలన అతడు ఎనిమిది అణాల లఖ్రాజ్ హక్కుకు యజమాని అవ్వడం జరిగినది. అతను అప్పటికే అంతే మేరకు వారసత్వ రీత్యా తనకు సంక్రమించిన మొకర్రారి హక్కును కలిగియున్నారు.

మధో శరణ్ సింగ్ యొక్క మొకర్రారి హక్కును కొనుగోలు ద్వారా పొంది ఉండిన హీరానంద్ ఝా మరియు దుర్గానంద్ ఝా 1917 లేక 1918వ సంవత్సరంలో ఒక సమయమున , శిస్తునకు సంబంధించిన ఒక డిక్రీ యొక్క అమలులో , మొత్తము గ్రామము యొక్క రైత్వారీ హక్కు ను కొనుగోలు చేసి దాని స్వాధీనం పొందడము జరిగినది. అందువలన వీరు గ్రామ భూములకు సంబంధించి రెండు అణాల భాగానికి మొకర్రారిదారులు మరియు 16 అణాలకూ రైతులు అయినారు. ప్రతివాదుల కుటుంబములోని మొదటి మరియు రెండవ పక్షాలకు సంబంధించి , వివిధ గ్రామాలలో ఉన్న భూముల

యొక్క విభజన కొరకు 1918వ సంవత్సరములో పాలమౌలో ఉన్న సబ్ ఆర్డినేట్ జడ్జి గారి కోర్టు ముందు హక్కు(టైటిల్) దావా నెం. 59/1918 దాఖలు చేయబడినది. దావాలోని కొంత భూమికి తోటి భాగస్తులై ఉన్నందున ఝా లను దావాలో ప్రతివాదులుగా చేర్చడమైనది. ఈ దావా 1921వ సంవత్సరములో డిక్రీ కావడమూ మరియు తుది విభజనలో వారికి అనుకూలముగా దర్భా గ్రామములోని రెండు అణాల భాగాన్ని కేటాయించడమూ జరిగినది. 1 , 3 మరియు 6 ఖటియాన్ లను మినహాయించి , మిగిలిన 14 అణాల భాగాన్ని ప్రతివాదులలో మొదటి పక్షానికి కేటాయించడము జరిగినది. ఈ మూడు ఖటియాన్ లను బిషేశ్వర్ దయాళ్ సింగ్ నకు కేటాయిం చడమూ, మరియు ఆ గ్రామంలో మిగిలిన భాగములలో అతనికి గల హక్కునకు మారుగా హోలియా గ్రామంలోని కొంత ఆస్తిని అతనికి ఇవ్వడమూ జరిగినది. విభజన ప్రక్రియ ఫలితంగా , ప్రతివాదుల లోని మొదటి పక్షం 'దర్హా' గ్రామంలో పద్నాలుగు అణాల మొకర్రారి హక్కు కలిగి ఉండ డము, బిషేశ్వర్ దయాల్ సింగ్ యొక్క హక్కు మూడు ఖటియాన్ లకు మాత్రమే పరిమితం అవ్వడమూ మరియు ఝా లకు వారి యొక్క రెండు అణాల మొకర్రారి భాగం ప్రత్యేకంగా కేటాయించమూ జరిగినది. 1926 వ సంవత్సరం ప్రాంతంలో ఒక సమయములో, లఖ్రాజ్ హక్కుదారులు అంటే పాథక్ లు మరియు బిషేశ్వర్ దయాళ్ సింగ్ ప్రభుత్వానికి చెల్లించ వల్సిన పన్ను బకాయి పడినట్లుగా తెలుస్తున్నది. తేదీ 17 , ఆగష్టు 1926న , పన్ను వసూలు కోసము వారిపై చర్య తీసుకోవడము మరియు ధృవపత్రము యొక్క అమలులో తేదీ 18.10.1927న వారి యొక్క హక్కులను బిజైనందన్ సహాయ్ అనే ఒక వ్యక్తికి విక్రయించడము జరిగినది. ఈ విక్రయము స్పష్టముగా లఖ్రాజ్ హక్కుల గూర్చి అయి ఉన్నది. ఇది తేదీ 19.12.1927 న ఖాయపరచబడినది; మరియు తేదీ 10, మార్చి, 1928న విక్రయ ధృవీకరణ పత్రం జారీ చేయబ డినది. దీని తర్వాత తేదీ 15, జూలై 1928న స్వాధీనం ఇవ్వడం జరిగినది. తేదీ 20, ఏప్రిల్ 1928న బిజైనందన్ సహాయ్ నుండి ఈ హక్కులను పొందిన కాంత్ ప్రసాద్ ఈ స్వాధీనమును పొందినారు. తేదీ 1, మే 1933 న , గ్రామంలో తనకు కలిగిన హక్కులను

కాంత్ ప్రసాద్ వాదులకు బదిలీ చేసినారు , దానితో వారు గ్రామములోని పదహారు అణాల భాగానికి యజమానులైనారు మరియు రెండు అణాల భాగానికి మొఖ్రరారిదారులు మరియు మొత్తము గ్రామములోని మొత్తము పదహారు అణాలకు రైతులు అయినారు.

విభజన డిక్రీ ద్వారా గ్రామములోని మొఖ్రరారి హక్కులో తాము 14 అణాల భాగము పొందినామని ఆరోపిస్తూ, ప్రతివాదులలోని మొదటి పక్షం మొకర్రారిదారులుగా , 1338-39 ఫసలి సంవత్సరానికి గానూ రైతు వారి కౌలు బకాయిలలో ఆరు అణాల వరకు భాగము కోరుతూ మరియు 1940-1941 ఫసలి సంవత్సరానికి గాను 14 అణాల వరకు భాగము కోరుతూ , వాదులపై తేదీ 21 , సెప్టెంబర్ 1934 న ఒక దావాను దాఖలు చేయడము జరిగినది. 1916-17వ సంవత్సరములలో తాము పథక్ ల నుండి కొనుగోలు చేసిన లఖ్రాజ్ హక్కులో బిషేశ్వర్ యొక్క మొకర్రా రి హక్కు విలీనమైనదనియూ, మరియు ప్రభుత్వము యొక్క ధృవీకరణ పత్రం ప్రకారం విక్రయించడం ద్వారా లఖ్రాజ్ మరియు మొకర్రారి హక్కులతో కలిపి , అతనికి గ్రామములో గల ఎనిమిది అణాల హక్కు వాదుల(plaintiffs) కు సంక్రమించిందనియూ మరియు ప్రతివాదుల యొక్క మొదటి పక్షము కేవలము తమ నుండి ఆరు అణాల వరకు మొఖ్రరారి హక్కును మాత్రమే కోరగలదనియూ వాదిస్తూ , వాదులు(plaintiffs) ఆ దావాను వ్యతిరేకించినారు. ఈ వాదనను త్రోసిపుచ్చుతూ ప్రతివాదుల యొక్క మొదటి పక్షము యొక్క కౌలు క్లెయిము సంపూర్ణముగా డిక్రీ చేయబడినది. ఈ డిక్రీ అప్పీలులోను మరియు రెండవ అప్పీల్ లోను కూడా ఆమోదించబడినది. కానీ హక్కు ( టైటిల్) యొక్క ప్రశ్న (తీర్పు లేకుండా) వదిలివేయబడినది. ప్రతివాదుల మొదటి పక్షం 1938 వ సంవత్సరములో , ఫసలి 1341కు తర్వాతి సంవత్సర లకు గాను శిస్తులో పద్నాలుగు అణా ల వసూలు కోసం మొకర్రారిదార్లుగా ఒక దావాను వేయడం జరిగింది. దాని ఫలితంగా, బిషేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క ఎనిమిది అణాల మొకర్రారి హక్కు తమ లఖ్రాజ్ హక్కులో విలీనం అయినదనియు, ధృవపత్రపు అమ్మకము ద్వారా

బిషేశ్వర్ దయాళ్ సింగ్ తనకు గల గ్రామములోని లఖ్రాజ్ మరియు మొకర్రారి హక్కులు రెండింటినీ విలీనము ద్వారా కోల్పోవడము జరిగినదనియు , 1921 సంవత్సరం నాటి విభజన డిక్రీ చట్టవిరుద్ధం అనియు మరియు ఏది ఏమైనా, ఆ డిక్రీ క్రింద ప్రతివాదుల మొదటి పక్షం ఆరు అణాల మొకర్రారి హక్కును మాత్రమే పొంది నారనియూ, మరియు వారు ఆ మేరకు మాత్రమే కౌలుదారుల నుండి శిస్తును పొందగలరని ఆరోపిస్తూ , వాదులు( plaintiffs) ప్రకటన ( declaration) మరియు నిషేదాజ్ఞ (injunction) ల కొరకు ప్రస్తుత దావాను దాఖలు చేయడం జరిగింది. శిస్తు కొరకు వేసిన దావాను ప్రతివాదులు కొనసాగించకుండా నిరోధించాలన్న ఒక నిషేదాజ్ఞను కూడా కోరడమైనది.

మొకర్రారిదారుల మధ్య జరిగిన ఒక వ్యక్తిగత విభజన ద్వారా , దర్హా గ్రామ ములోని భూము లు మొకర్రారిదార్ల మూడు వర్గాల మధ్య విభజిం చబడినవనియు, ప్రతి వర్గమూ తమ తమ వేరు వేరు మరియు పరిధులు నిర్ణయించబడిన భాగముల స్వాధీనము కలిగి ఉన్నదనియు , వాద పత్రములో ఆరోపించబడినది, ఇంకా లఖ్రాజ్ హక్కుదారుల మధ్య అంటే బిషేశ్వర్ దయాళ్ సింగ్ ఒక వైపున మరియు మరోవైపు డియోలాల్ పాథక్ , నేమాన్ పాథక్ మరియు సూరజ్‌నాథ్ పాథక్ ల మధ్య మరొక విభజన జరిగి నదనియు, దాని మూలంగా పరమేశ్వర్ దయాళ్ సింగ్ మరియు ఇతరు లు, మరియు హీరానంద్ ఝా, దుర్గానంద్ ఝా లకు సంబంధించిన మొకర్రారీ పట్టీల భూములు డియోలాల్ పాథక్ మరియు ఇతరుల యొక్క పట్టిలో చేరగా, ప్రతివాదుల రెండవ పక్షం నకు సంబంధించిన మొకర్రారి పట్టిలో ఉన్న భూములు అతని యాజమాన్య లఖ్రాజ్ పట్టీలోనికి రావడము మరియు ఈ విభజనల వలన ప్రతివాదుల రెండవ పక్షం యొక్క మొకర్రారి హక్కు అతడి లఖ్రాజ్ హక్కులో విలీనం కావడము మరియు ధృవపత్రము విక్రయం కింద అతడి యొక్క మొత్తం హక్కూ వాదులకు సంక్రమించడము జరిగినదనియూ కూడా (వాద పత్రములో) చెప్పబడినది.

వారి వాద పత్రములోని 5 మరియు 8 పేరాలలో, వాదులు ( plaintiffs) ఆరోపించిన రెండు విభజనలు కూడా రుజువైనవనియు , మరియు బిషేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క మొకర్రారి హక్కు అతని లఖ్రాజ్ హక్కులో విలీనం అయినదనియు, మరియు ధృవపత్రపు విక్రయము ద్వారా , అతని యొక్క లఖ్రాజ్ మరియు మొకర్రారి హక్కులు రెండింటితో పాటు , పాథక్ ల యొక్క ఎనిమిది అణాల లఖ్రాజ్ హక్కును కూడా కొనుగోలు చేసిన వ్యక్తి పొందడము జరిగినదనియు, ప్రతివాదుల యొక్క మొదటి పక్షము గ్రామములోని ఆరు అణాల మొకర్రారి హక్కు కలిగి ఉండడం వలన , వారు ఆ మేరకు వారి యొక్క శిస్తు గురించిన దావాలో డిక్రీకి అర్హులై ఉన్నారనియు, మరియు వారు శిస్తులో పద్నాలుగు అణాల భాగమునకు డిక్రీని అడగజాలరనియూ, విచారణ జడ్జీ నిర్ధారించడమైనది. వాదులు(plaintiffs) ఆరోపించిన రెండు విభజనలు కూడా ఋజువు కాలేదనియు, మరియు ఎనిమిది అణాల మొకర్రారి హక్కు, బిషేశ్వర్ దయాళ్ సింగ్ పాథక్‌లతో కలిసి ఉమ్మడిగా కలిగియున్న పదహారు అణాల లఖ్రాజ్ హక్కుతో విలీనము కానేరదనియూ, అప్పీల్‌లో హైకోర్టు నిర్ధారించడమైనది. ఈ నిర్ణయము ఫలితముగా వాదుల(plaintiffs) యొక్క దావాను త్రోసిపుచ్చడమైనది.

వాదులు( plaintiffs) 5 మరియు 8 పేరా గ్రాఫ్ లలో చూపించిన రెండు విభజనలు ఋజువు కాబడలేదనడములో హై కోర్టు పొరబడినదని , అప్పీలుదారుల తరపు న్యాయవాది ప్రస్తుత అప్పీలులో వాదించినారు. రికార్డులో ఉన్న పత్రమూలక సాక్ష్యము మరియు మౌఖిక సాక్ష్యం ద్వారా రెండు విభజనల యొక్క వాస్తవికత నిరూపింపబడినదనియు , మరియు ఈ విభజనల దృష్ట్యా బిషేశ్వర్ దయాళ్ సింగ్ ఎనిమిది అణాల లఖ్రాజ్ హక్కునకు ప్రత్యేక యజమాని అవ్వడము మరియు ఆ హక్కులో అతని యొక్క ఎనిమిది అణాల మొకర్రారి హక్కు విలీనం కావడము మరియు ధృవపత్రపు విక్రయం ద్వారా అతని యొక్క మొత్తము హక్కు కొనుగోలుదారునకు దఖలుపడినదనియు, నిర్ధారించవలసి ఉండడం వలన

ప్రతివాదుల మొదటి పక్షం వారికి గల ఆరు అణాల మొకర్రారి హక్కునకు సంబంధించి మాత్రమే, రైతుల నుండి కౌలు వసూలునకు వారు దావాను నిర్వహించగలిగి ఉన్నారని, వాదించడము జరిగినది.

మా అభిప్రాయం లో, కక్షిదారులు మా ముందు కానీ , క్రింది రెండు కోర్టు ల ముందు కానీ లేవనెత్తిన వారి వారి వాదనలను పరిగణలోనికి తీసుకోకుండా , ఒక చిన్న అంశం మీదనే ఈ అప్పీల్‌ను పరిష్కరింపవచ్చును. బిషేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క ఎనిమిది అణాల లఖ్రాజ్ హక్కు , అదే దామాషా లో గల అతని మొకర్రారి హక్కులో విలీనమైనదన్న ఆరోపణ ఒక్కదాని మీదనే , వాదుల యొక్క కేసు ఆధారపడి ఉంది. కౌలుదాత కౌలుదారుని యొక్క హక్కును కొనుగోలు చేసినట్లైతే , ఒకే వ్యక్తి ఒకే సమయములో యజమాని మరియు కౌలుదారుడిగా ఉండజాలనందున , కౌలు లుప్తమైపోతుంది , కానీ చాలా మంది కౌలుదారులలో ఒక కౌలుదారు , కౌలుదాత యొక్క హక్కులో కొంత భాగాన్ని మాత్రమే కొనుగోలు చేసినట్లైతే , కౌలు లుప్తమవ్వడం జరగదు. అలాంటి కేసులో కౌలు మరియు ఉత్తర హక్కు ఏకకాలములో సంఘటించినవని చెప్పజాలము. మొదట్లో ఒకే కౌలు ఒప్పందం కింద మొకర్రారీ గా మౌజా దర్హా ఇవ్వబడినది, మరియు కుటుంబం యొక్క మూడు శాఖలకు కౌలు హక్కు వారసత్వముగా సంక్రమించడము వలన మొత్తం కౌలులో బిషేశ్వర్ దయాళ్ సింగ్ ఎనిమిది అణాల హక్కును పొందినారు అన్నది, వాదుల యొక్క కేసు. తరువాత అతడు 1916వ సంవత్సరంలో మొత్తం ఉత్తర హక్కులో ఆరు అణాల భాగాన్ని మరియు 1917 సంవత్సరంలో మరో రెండు అణాల భాగాన్ని కొనుగోలు చేసినారు. ఈ కొనుగోళ్ల వలన అతడు మొత్తం లఖ్రాజ్ కమతములో ఒక మొయిటీ వరకు ఉమ్మడి యజమాని అయినారు. కానీ , ఎప్పుడూ కూడా అతడు గ్రామంలోని మొత్తం లఖ్రాజ్ హక్కునకు గాని లేక దానిలోని మొత్తం మొకర్రారి హక్కునకు గాని యాజమన్యం కలిగి ఉండలేదు. అందువలన లఖ్రాజ్ మరియు మొకర్రారి హక్కులు కలిగి ఉన్న మొత్తం ఎస్టేట్ నకు సంబంధించిన కౌలుదాత మరియు కౌలుదారుల

హక్కుల సమ్మేళనం జరిగి ఉండలేదు , మరియు ఆ కారణం చేత బిశేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క మొకర్రారీ హక్కు అతని లఖ్రాజ్ హక్కులో విలీనం కాబడి ఉండలేదు.

బిశేశ్వర్ దయాళ్ సింగ్ కేవలము చాలా మంది మొకర్రారి ఉమ్మడి హక్కుదారులలో ఒకరు మాత్రమే అయి ఉన్నందున , అతడు లఖ్రాజ్ హక్కులోని భాగములను కొనుగోలు చేసినందువలన కౌలు లుప్తము కావడము కానీ , లేదా దాని(కౌలు యొక్క) సమగ్రత కావడము విచ్చిన్నం కానీ జరగదు. కౌలుదాత కు సంబంధించినంత వరకు , చట్ట ప్రకారము , చాలా మంది కౌలుదారులతో కూడి యున్న కౌలు, ఒకే కౌలుదారుగా సంఘటితం అవ్వడము వలన ఈ సమూహములో సంఘటితమైన ప్రతి భాగమూ మొత్తములో ఉమ్మడి హక్కులు కలిగి ఉండి , మొత్తానికి ఉమ్మడి బాధ్యతలను నెరవేర్చవలసి ఉంటుంది. కనుక , వాదులు ఆరోపించినట్లుగా మొకర్రారిదారుల మధ్య మొకర్రారి హక్కు విభజన జరిగినప్పటికీ, వారు కౌలుదాత కు చెల్లించవలసిన శిస్తు పై ఏ ప్రభావము ఉండదు.

***వైట్ వర్సెస్ టిండాల్***(13 App. Cas.263) కేసులోని **లార్డ్ హాల్స్ బరీ** మాటల ప్రకారం, ఒక కమతమును గురించి దీర్ఘకాలపు కౌలును ఉమ్మడి కౌలుదారులుగా కక్షిదారులు పొందినప్పుడు , వారి ఒప్పందం ప్రకారము వారు చెల్లించాల్సింది ఒక్క కౌలు మాత్రమే కానీ , రెండు కౌలులు కాదు , మరియు ఒక్కొక్కరు సగము కౌలు కాక ఒక కౌలును చెల్లించవలసి ఉంటుంది. కౌలుదారు మరియు కౌలుదాతల మధ్య మొత్తము కౌలు కమతమును గురించి ఆస్తి విషయక సన్నిహిత సంబంధము ఉంటుంది మరియు అతడు భూమితో పాటు వచ్చే అన్ని ఒడంబడికల కూ బాధ్యత వ హించవలసి ఉంటుంది. అందువలన చట్టం ప్రకారం మొకర్రారి హక్కుకు సంబంధించి(ఆ హక్కుదారుల) మధ్య జరిగిన విభజన కౌలు యొక్క సమగ్రతను ప్రభావితము చేయదు మరియు అలా జరిగినట్లు చెప్పబడిన విభజన మూలకముగా, మరొక కౌలు ఒప్పందం క్రింద బిషేశ్వర్ దయాళ్ సింగ్, మొకర్రారిదార్ కాజాలరు. మామూలుగా చాలా మంది

కౌలుదారుల మధ్య కౌలు కమతపు అనుభవ సౌలభ్యం కోసం ఇలాంటి విభజనలు జరుగుతుంటాయి, కానీ ఇవి ఏ విధముగానూ కౌలు యొక్క సమగ్రతను ప్రభావితము చేయడము కానీ , లేక ఈ హక్కు కలిగిన ప్రతి వ్యక్తి ప్రత్యేక కౌలుదారు అవ్వడము కానీ జరగదు. ప్రస్తుత కేసులో కౌలుదాతకు సంబంధించినంత వరకు ఈ విభజన ఫలితముగా కౌలు విభజింపబడి అనేక కౌలులు ఉనికిలోనికి వచ్చినట్లుగా ఏమీ ఆరోపణ చేయబడలేదు. అదేవిధంగా, విభజింపబడిన భూమిదారులకు మరియు వేర్వేరు మొకర్రారి హక్కుదారులకు మధ్య క్రొత్తగా ఒప్పందం జరిగినట్లుగా ఆరోపణ లేనప్పుడు , అనేక లఖ్రాజ్ హక్కుదారుల మధ్య జరిగినట్లుగా చెప్పబడుతున్న విభజన , కౌలు యొక్క సమగ్రతను ప్రభావితం చేయజాలదు. గ్రామములోని లఖ్రాజ్ కమతము ఇప్పటికీ ఒకే కమతముగా ఉన్నది , మరియు అది వేర్వేరు కమతములుగా విభజింపబడినట్లుగా ఏ ఆరోపణా లేదు. లఖ్రాజ్ హక్కునకు యజమానులైనవారందరూ ఉమ్మడిగా ప్రభుత్వమునకు శిస్తు చెల్లించవలసిన బాధ్యత కలిగి ఉండినారు మరియు వారు శిస్తు చెల్లించడములో బకాయి పడినందున , మొత్తం లఖ్రాజ్ హక్కును ధ్రువపత్రపు విక్రయము ద్వారా అమ్మడమైనది. ఈ పరిస్థితులలో, దావా పత్రములో చేయబడిన ఆరోపణలు , విలీన సిద్ధాంతాన్ని వర్తింపచేయడానికి అవసరమైన నిబంధనలను ప్రతిపాదించడము లేదు. వాదుల(plaintiffs) యొక్క కేసు ప్రకారమే , ప్రతివాదుల మొదటి పక్షమునకు సంబధించిన ఆరు అణాల హక్కు యొక్క కౌలు ఇప్పటికీ మనుగడలో ఉన్నది, మరియు ఈ పరిస్థితులలో, కక్షిదారుల మధ్య బహిర్గత లేక అంతర్లీనమైన కొత్త ఒప్పందం ఉన్నట్లుగా ఏమీ ఆరోపణ లేనప్పుడు , బిషేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క ఎనిమిది అణాల(కౌలు) హక్కు లుప్తమైపోయిందని నిర్ధారించడానికి వీలుకాదు. కౌలు కమతము, ఉత్తర హక్కులో ఏ విధముగాను కలిసిపోవడము జరిగియుండలేదు మరియు లఖ్రాజ్ , మోకర్రారి హక్కులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

పైన చెప్పబడిన కారణాల వలన, బిశేశ్వర్ దయాళ్ సింగ్ యొక్క మోకర్రా రి అతడి లఖ్రాజ్ హక్కులో విలీనం కాలేదని యు(అది) ధృవపత్రము విక్రయం కింద అమలుకొనుగోలుదారు నకు సంక్రమించలేదనియు, హైకోర్టు చేసిన నిర్ధారణతో మేము ఏకీభవిస్తున్నాము; అంతేకాక, అది కుటుంబ విభజన వలన ప్రతివాదుల మొదటి పక్షానికి చెందడం జరిగినది మరియు వారు మొకర్రారిదార్లుగా, వాదుల( plaintiffs) యొక్క రైతుల నుండి శిస్తులో పద్నాలుగు అణాల భాగం వరకు పొందడానికి హక్కు కలిగి ఉన్నారు. ధృవపత్రపు విక్రయము క్రింద అమలుకొనుగోలుదారునకు , తరువాత వాదులకు(plaintiffs) కేవలము పాథక్ లు మరియు బిషేశ్వర్ దయాళ్ సింగ్ ల యొక్క లఖ్రాజ్ హక్కు మాత్రమే సంక్రమించినది మరియు ఈ విక్రయము ద్వారా ఒక డిక్రీ-ఋణగ్రస్తుడు (judgment-debtor) మరొక ఋణగ్రస్తునికి సంబంధించిన దానికంటే అధికమైన హక్కును అమలుకొనుగోలుదారునికి కలుగజేయజాలడు. విలీన సిద్ధాంతాన్ని ఈ కేసు యొక్క వాస్తవాలకు వర్తింప చేయజాలమన్న, మా యొక్క నిర్ధారణ దృష్ట్యా, వాదుల(plaintiffs) యొక్క కేసు విఫల మై తీరవలసినదే. ఆ ప్రకారముగానే మేము ఈ అప్పీ లు సారరహితమైనదని నిర్ధారిస్తున్నాము మరియు దీనిని ఖర్చులతో త్రోసిపుచ్చుతున్నాము.

**అప్పీల్ త్రోసిపుచ్చబడినది.**

అప్పీలుదారు తరపున ఏజెంట్: ఎస్పీ వర్మ.

ప్రతివాది తరపున ఏజెంట్: PK ఛటర్జీ.